# సన్న జీవాలు

## టార్చిలైటు

రెడ్డిపాలెం అని ఓ చిన్న పల్లెటూరు. ఈ గ్రామంలో బోర్డు ఎలిమెంటరీస్కూలు పెట్టి ఓ సంవత్సరంకూడా కాలేదు. అంతకుపూర్వం ఓ వైదికాయన వీథిబడి పెట్టుకొని పదిమంది పిల్లకాయలకి చదువు చెప్పుకొంటూ ఉండేవాడు. నిరుడుసంవత్సరం జిల్లాబోర్డు ఎన్నికలలో గరటయ్య అని ఆ పక్కవూరురైతు ఒకాయన గెలిచి, ప్రెసిడెంటు అయ్యాడు. ఆయనగారికి రెడ్డిపాలెం అంటే ఎంతో మోజు. ఆ రెడ్డిపాలెంలో పదియిళ్ళవాళ్ళు కాపులు బలవంతు లున్నారు. తెల్లవారి లేస్తే వాళ్ళదగ్గర ఇంత తెచ్చుకోవడం, ఇవ్వడం-వాళ్ళకీ వాళ్ళకీ తొంభయి లావాదేవీలు. అందువల్ల తన ప్రెసిడెంటుగిరీలో ఆ గ్రామానికి కొన్ని శాశ్వతమయిన ఉపకారాలు చేయాలని, మీటింగులో బోర్డుస్కూలు మంజూరు చేయించి, పదిహేనువందల రూపాయలతో బిల్డింగు కట్టించి, వీథిబడిలో చదువుకొనే పిల్లకాయలనందరినీ బోర్డుస్కూలులో చేర్పించాడు ప్రెసిడెంటు.

ఇద్దరు టీచర్లకు చాలినంతమంది పిల్లలు లేనందువల్ల పెంటలమీద తిరిగే చాకలి, మంగలి, కుమ్మరి, వొడ్డె, సాలె, గొల్ల, యానాది వగైరా ప్రతి పిల్లకాయనీ తీసుకు వచ్చి ఓ అరవయిమందిని పోగుచేసి ఆ స్కూలులో చేర్పించాడు ఆ ప్రెసిడెంటు.

# సన్నజీవాలు

ఈ సంవత్సరమే కొత్తగా పెట్టిన స్కూలయినందువల్ల ఈ యేడు ఈ స్కూలులోకూడా ఆరోగ్యవారం జరిపి, పిల్ల కాయలచేత ఆటలాడించి, బహుమతు లివ్వవలసిందని ప్రెసిడెంటుగారి దగ్గరనుండి హెడ్మాస్టరుకు తాఖీదు వచ్చింది. అయితే, దీని కయ్యే ఖర్చులు జిల్లాబోర్డు భరించుకొనే స్థితిలో లేనందువల్ల గ్రామంలోని రైతులవల్లా, గ్రామస్థుల వల్లా తలాకొంచెంగా చందాలు వేయించి, ఆ పైకంతోనే ఆరోగ్య వారం జరపవలసిందనికూడా ఆ తాఖీదులోనే వ్రాశారు ప్రెసిడెంటుగారు.

ఆ హెడ్మాస్టరు క్రైస్తవుడు. పేరు జకరయ్య. పాపం, బీదవాడూ, భయస్థుడూను. ప్రెసిడెంటుగారి ఉత్తరువు తీసుకొనివెళ్లి గ్రామంలో పదిమంది పెద్దలకూ చూపి, తలా కొంచెం చందా వేసి సహాయం చేయవలసిందని కోరాడు జకరయ్య. ఈ ఆరోగ్యవారాలూ, వేడుకలూ, వీటి ఉపయోగాలూ వాళ్ళ కంతగా అర్థమైనా కాకపోయినా, ఏమో పిల్లకాయలచేత ఆటలాడించి బహుమతులిస్తానని అంటున్నాడు అయ్యవారు అని, పదిమంది కాపులూ, బ్రాహ్మలూ, గ్రామాధికార్లూ కలిసి చందాలు వేసి, ఓ యిరవైరూపాయలు జమచేసి, అతనిచేతిలో పెట్టారు.

స్కూళ్ళ డిప్టీ ఇన్‌స్పెక్టరును పిలుచుకొనివచ్చి ఆయన సమక్షంలోనే పిల్లకాయలచేత అరమైలు పరుగు, నూరుగజాల నడక, ఎక్కువఎత్తు ఎగరడం, ఎక్కువ పొడుగు

దూకడం, బల్లలకింద కాళ్ళకు గోతాలు కట్టుకొని నడవడం, కింద చల్లిన పువ్వులేరి కుప్పగా పెట్టడం-ఒక రకమేమిటి, పట్నవాసపు బడులలో ఆడించే ఆటలన్నీ పిల్లకాయలచేత ఆడించి, ఆటల్లో గెలుపొందిన పిల్లకాయలకు ఒకరికి సూటు కేసు, ఇంకొకరికి టార్చిలైటు, మరొకరికి పెద్దసైజు జపాను అద్దం, ఇంకొకరికి ఫౌన్‌టెన్‌పేనా, వేరొకరికి సబ్బు పెట్టె, ఇంకొకరికి గొడుగు-ఇట్లాగే తలా ఒక వస్తువు బహుమతీలు యిచ్చాడు.

కాని ఆ రాత్రికే గ్రామంలో అల్లకల్లోలం బయలు దేరింది.

ఆటల్లో గెలిచి బహుమతులు తీసుకొన్న పిల్లకాయ లందరూ—ఒకడు చాకలివాడు, ఇంకొకడు మంగలివాడు, మరొకడు వొడ్డెవాడు, యానాదివాడు, సాలివాళ్ళపిల్ల, కుమ్మరివాళ్ళ పిల్ల—ఈరకంగా అందరూ బీదవాళ్ళ పిల్ల కాయలే. గ్రామంలో డబ్బుగలవాళ్ళూ, గొప్పవాళ్ళూ, పలుకుబడిగలవాళ్ళూ యిచ్చిన డబ్బుతో వస్తువులు కొన డమూ, ఆ వస్తువులు చివరకు వాళ్ళ చేతికింద నీళ్లుతాగే నౌకర్ల పిల్లకాయ లెత్తుకొనిపోవడమూ జరిగింది.

గ్రామస్థులు కుతకుత ఉడికిపోతున్నారు. తమ పిల్ల కాయలకు వస్తాయనుకొన్న వస్తువులన్నీ కూటికీ గుడ్డకూ మొగంవాచిన దరిద్రజీవుల సంతానం ఎత్తుకొనిపోయారు. అందులో తమ స్వగ్రామంలో, తమ కళ్ళయెదుట తెల్లవారి

లేస్తే తమ చెప్పుచేతల్లో ఉండి, తమకింద తాబేదారీ పని చేసే నౌకర్ల బిడ్డలకు బహుమతులూ, తమ బిడ్డలకు వాళ్ళ చేతలూను! పెద్దరెడ్డిగారి అబ్బాయి ఒకటే గోల! కరణం గారి అబ్బాయి ఇంట్లో వాళ్ళని నిలవనివ్వడంలేదు. సాలె వాళ్ళ కిచ్చిన అద్దం తెచ్చి నా కిస్తావా, చస్తావా అని కాశయ్య కూతురు ఒకటే ఏడుపు! ఇంతెందుకు, చాకలివాళ్ళూ, మంగలివాళ్ళూ, కుమ్మరివాళ్ళూ అందరూ సంతోషంతో పొంగి పోతూ పండగ చేసుకొంటూ ఉంటే పెద్దగ్రామస్థుల ఇళ్ళల్లో ఆరోజు రోజంతా ఎండగలూ, ఉపవాసాలూను!

హెడ్డుమాస్టరు జకరయ్య కావలెనని వాళ్ళందరికీ ఈ అవమానం చేశాడని వాళ్ళ నమ్మకం. ఊళ్ళో పెద్ద లనుకొనే పదిమందీ చేరి కూడబలుక్కున్నారు. ఆ మర్నాడు ఉదయాన్నే మీటింగు పెట్టి జకరయ్యను పిలిపించి, "మా దగ్గర డబ్బులు దండి, ఊళ్ళో వాళ్ళకి పంజారం చేస్తావా? ఇంత తలపొగరా నీకు? మా డబ్బుతో కొన్న వస్తువులు మళ్ళీ వాపసు తీసుకొనివచ్చి, మా పిల్లకాయలకు పంచిపెడుతావా, లేక నిన్ను పట్టుకొని మెత్తగా తన్నమంటావా" అని పది మందీ కస్తీ చేశారు.

జకరయ్య గడగడలాడిపోయాడు. ఒంటరిగాడు. అది గ్రామంలో పెద్దపులు లనుకొనేవాళ్ళందరూ చేరి చేసిన పంచాయతీ. అదిగాక, పబ్లికు మీటింగులో డిప్టీ యిన్‌స్పెక్టరు గారి సమక్షంలో పంచిపెట్టిన బహుమతీ వస్తువులు—వాటిని

మళ్ళీ తాను ప్రైవేటుగా ఊడబెరుక్కోవచ్చునా? ఈ సంగతి జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారికి తెలిస్తే తన నౌకరీకి మోసం కదూ, మరి తీసుకురాకపోతే గ్రామస్థులు బ్రతకనిస్తారా?

గండకత్తెర చుట్టుకొన్నట్టున్నది అతగాడికి.

జకరయ్యా అట్టే ఆలోచించి, "స్వామీ! మీకు దణ్ణం పెట్టుతా. ఈ బహుమతు లిచ్చిన వస్తువులు వాపసు తీసుకొని వచ్చేపని నా నెత్తిన పెట్టకండి. మీ రందరూ చేరి నామీద నేరం పెట్టారు కాబట్టి, నా స్వంతడబ్బుతో ఆ వస్తువులు మళ్ళా కొత్తవి కొని మీకు ఇచ్చుకొంటాను. అంతమాత్రం దయపెట్టండి" అని వాళ్ళకాళ్ళు పట్టుకొన్నాడు.

కాని, వారంతా పెద్దమనుష్యులు—ఒప్పుకొంటారా వారు? జకరయ్యా ఎంత చెప్పినా, ఎన్నివిధాల ప్రార్థించినా, "ఆ వస్తువులు ఆ పిల్లకాయలదగ్గర ఉండడానికిమాత్రం వీలులేదు. పోయి నీవు వాపసు తీసుకొని వస్తావా రావా?" అని వాళ్లు నిక్కచ్చి చేశారు.

జకరయ్యాకు దిక్కుతోచక, ఆ వెళ్ళడం వెళ్ళడం ఏకాయెకిని జిల్లాబోర్డు ప్రెసిడెంటుదగ్గరకి వెళ్ళి, జరిగిన విషయమంతా ఆయనతో మనవిచేసుకొని, రక్షించండని ఆయన కాళ్ళమీద పడ్డాడు.

ఆ ప్రెసిడెంటు అసాధ్యుడు; రాజకీయవేత్త; దూరాలోచనపరుడు; ముందు సంవత్సరం రాబోయే ఎన్నికల్లో శాసనసభకికూడా నిలబడాలని చూస్తున్నాడు. జకరయ్యా

చెప్పుకొన్నదంతా విని "నేను రేపు మీ గ్రామానికివచ్చి, గ్రామస్థులతో స్వయంగా మాటాడి వ్యవహారం పరిష్కారం చేస్తా. నీకేం భయంలేదు, పో"మ్మన్నాడు.

జకరయ్య ప్రెసిడెంటుదగ్గరకు పోయిన సంగతి గ్రామస్థులకు తెలిసి, వాళ్లు వెంటనే బహుమతులు తీసుకొన్న పిల్లకాయల తల్లిదండ్రులను రచ్చకు పిలిపించి, బెదరించి, వాళ్ళ దగ్గరి వస్తువులన్నీ వాఫసు తీసుకొని, పెద్దరెడ్డి స్వాధీనంలో పెట్టుకొన్నారు.

భయపడి అందరూ వస్తువులు వాఫసు యిచ్చారు. కాని, టార్చిలైటు తీసుకొన్న చాకలివాళ్ల పిల్లవాడుమాత్రం వాఫసు ఇవ్వలేదు. వాడి తండ్రి రంగం, మోల్మేను వగైరా పట్నాలు తిరిగివచ్చినవాడు. మనిషి—ఎర్రగా నేత్రాలూ వాడూ–ఆజానుబాహువు : ఏడడుగుల ఎత్తుంటాడు. చేతులకు మురుగులు, దండకడియం, అయిదు వేళ్ళకీ ఉంగరాలు, మొలకు బిళ్ళల మొలతాడు, చెవులకు తమ్మెట్లు—చూడ్డానికి మహా జబర్దస్తీగా ఉంటాడు. గ్రామస్థు లెంత బెదిరించినా వాడు టార్చిలైటు వాఫసు ఇవ్వకుండా మొండొడ్డుకొని కూర్చున్నాడు. పైగా, ఇచ్చినవాళ్ళనికూడా చీవాట్లు పెట్టి పురెక్కించాడు.

మరునాడు ఉదయం జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారు గ్రామానికి వచ్చేవరకు వస్తువులు చేజారి వాఫసు యిచ్చిన వాళ్లూ, వాళ్ల బంధువులూ, చాకలివాళ్ళూ మొదలైన


Mr; Garatayya,
Board E.G. Scho

అలగాజనం అందరూ యేభయిమంది తోడయి, పెద్దరెడ్డి యింటిమీద పడి, "చాకలివాడు వస్తువు ఇవ్వనిదీ మేము మాత్రం వాపసు ఇస్తామా? మా వస్తువులు మాకిచ్చివేయ వలసిం"దని కర్రలూ కత్తులూ పట్టుకు తయారయారు.

ఇంతలో జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారు రాగానే వారిని పెద్దరెడ్డియింటికి పిలుచుకొనిపోయి బసచేయించారు.

పదిగంటలదాకా ఎవరెవరు ఏమేమి మాటాడు కొన్నారో అంతా గోప్యంగా జరిగిపోయింది. పదకొండు గంటలకు కారెక్కి హెడ్ క్వార్టర్సుకు చక్కా వెళ్ళిపోయాడు ప్రెసిడెంటు.

రంగం చాకలివాడి హుషారీ చూచుకొని అలగాజన మంతా ఏకమై నడుములు బిగిస్తున్నారు. పెద్దరెడ్డి వీధిలోకి రావడం మానేసి రహస్యంగా మాలవాళ్ళకు చెప్పి పంపి, కల్లుపోయిస్తాననీ, డబ్బులిస్తాననీ బేరాలు చేస్తున్నాడు.

వ్యవహారం ముదిరి కొట్టుకోవడందాకా వచ్చేవరకు, మునసబు కరణాలు చల్లగా తప్పుకొని, గ్రామపరిస్థితులు పోలీసువారికీ, మేజస్ట్రేటుకీ రిపోర్టు పంపించారు.

గ్రామంలోఅయితే జకరయ్య ప్రస్తావన మళ్ళా ఏమీ లేదుకాని, గ్రామస్థులతో మాటాడి ప్రెసిడెంటుగారు వెళ్ళి పోయిన తరువాత ఒకనాటి ఉదయం జకరయ్యకు పోస్టులో ఓ కవరు వచ్చింది. అది చింపిచూస్తే ఇట్లా ఉంది :

టార్చిలైటు

''జిల్లాబోర్డు ఆఫీసు, తే 16-11-38.

ఉత్తర్వు

ఇటీవల మీ గ్రామంలో జరిగిన ఆరోగ్య శిశువార వేడుకల సందర్భంలో మీరు అజాగ్రత్తగా ప్రవర్తించి, గ్రామంలో అనవసరమైన కలతలూ, పార్టీలూ పెంచి, పాఠశాల పురోభివృద్ధికేగాక, గ్రామ పురోభివృద్ధికికూడా భంగకరంగా నడచుకొన్నందువల్ల మీరు స్కూలు టీచరుగా ఉండడానికి అనర్హులని తీర్మానించి, మీ సంజాయిషీతో నిమిత్తం లేకుండానే మిమ్మల్ని ఈ తేదీ లగాయతు నౌకరీ నుండి మర్తరబు చేయడమైనది.

(సం) గరటయ్య,
ప్రెసిడెంటు''.